# 'దళిత బంధు'వు సీఎం కేసీఆర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండ శ్రీనివాస్

- పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నింపిండు
- సీఎం కేసీఆర్ సభకు దళిత బంధు కుటుంబ సభ్యులందరం వస్తం.. ఆశీర్వదిస్తం
- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

జమ్మికుంట, నవంబర్15: దళిత బంధు పథకంతో దళిత కుటుంబాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని, ముమ్మాటికీ కేసీఆర్ 'దళిత బంధు'వని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. దళిత జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత కేసీఆర్‌దేనని, ఆయనను దళిత జాతి గుండెల్లో పెట్టుకుంటుందని స్పష్టం చేశారు. బుధవారం పట్టణ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండ శ్రీనివాస్ మాట్లాడారు. ఇప్పటి వరకు ఏ పార్టీ, నాయకుడు దళితులను పట్టించుకోలేదని, దళిత జాతిని ఆర్థికంగా ఎదిగేందుకు హుజూరాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. పైరవీల్లేవు, పైసా ఖర్చు లేదు, గ్యారెంటీ లేదు.. తిరిగి చెల్లించుడు లేదు.. ఇలాంటి పథకం ప్రపంచంలోనే ఎక్కడా లేదని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలు అందించారని తెలిపారు. దళిత బంధుకు ఎంపికైన లబ్ధిదారులు ఆయా రంగాల్లో స్థిరపడుతున్నారని, ఆర్థికంగా ఎదుగుతున్నారని చెప్పారు. దళిత బంధు పథకాన్ని కూడా కొందరు రాజకీయం చేయడాన్ని తప్పుబట్టారు. పథకం అందరికీ అమలైందని, రెండో విడుత డబ్బులు కూడా రిలీజ్ అవుతాయని చెప్పారు. రెండో విడత డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లోనే ఉన్న విషయాన్ని వివరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీలకు దళితులు గుర్తుకొచ్చారని, ఆ పార్టీలు దళితులకు చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల దేవుడు.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను ఓడిచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, అలాంటి పార్టీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. మంద కృష్ణతో బీజేపీ సభ ఏర్పాటు చేయడంపై మాట్లాడుతూ.. మంద కృష్ణపై గౌరవం ఉందని, ఇప్పటి వరకు ఎస్సీ వర్గీకరణ బీజేపీ ఎందుకు చేయలేదో చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్ వర్గీకరణపై రెండుసార్లు అసెంబ్లీ తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కమిటీలు అవసరం లేదని, వెంటనే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మేదేలేదన్నారు. ఇక జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రేపు సీఎం కేసీఆర్ సభ ఉందని, సభకు దళిత బంధుతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబ సభ్యులందరం స్వచ్ఛందంగా తరలివస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్‌పై దళితుల అభిమానాన్ని చాటుతామని చెప్పారు. బీఆర్‌ఎస్ సర్కారు ఒక్క దళితులకే కాదనీ, ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిందని తెలిపారు. రాష్ట్రంలో మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆరేనని, బీఆర్‌ఎస్ గెలుపును ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించుకుని అసెంబ్లీకి పంపుదామని, రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. సమావేశంలో టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ పోడేటి రామస్వామి, మాజీ సర్పంచ్ పర్లపెల్లి రమేశ్, యువ నాయకులు మంద రాజేశ్, అంబాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి
- కార్యకర్తలకు హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి దిశానిర్దేశం

హుజూరాబాద్‌టౌన్, నవంబర్15: అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకువెళ్లాలని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో సిటీ సెంటర్‌లో పట్టణంలోని 30 వార్డులు, మండలంలోని 20 గ్రామాల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పెద్దిరెడ్డి వేర్వేరుగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉండాలని గడపగడపకూ వెళ్లి కోరాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు అవకాశం ఇస్తే తెలంగాణ రాష్ట్రంలో తలెత్తే మతకల్లోలాలు, కర్ఫ్యూలు, కరెంట్ కోతల గురించి వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశాల్లో పురపాలక సంఘం చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, సంగెం ఐలయ్య, పట్టణ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కల్లెపల్లి రమాదేవి, ఎంపీపీ ఇరుమల రాణీసురేందర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, సోషల్‌మీడియా రాష్ట్ర నాయకుడు తులసి లక్ష్మణమూర్తి, రాష్ట్ర నాయకుడు వర్దినేని రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్నెబోయిన శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీపీ సబ్బని ఉమాదేవి, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హాజరైన 30 వార్డుల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు



సీఎం సభకు రావాలని మహిళ కు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక

# సీఎం సభకు తరలిరావాలి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 15: ఈ నెల 17న జమ్మికుంట పట్టణంలో సీఎం ఆశీర్వాద సభకు స్వచ్ఛందంగా తరలిరావాలని బుధవారం పట్టణంలో బీఆర్‌ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ప్రచారం నిర్వహించారు. 7వ వార్డులోని బండ అంకూస్‌వాడలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ గడప గడపకూ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ఓట్లు అభ్యర్థించారు. 15వ వార్డులో

### పట్టణంలో బీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారం

బీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు, కౌన్సిలర్ కల్లెపల్లి రమాదేవి ఆధ్వర్యంలో ఇంటింటా బొట్టుపెట్టి, కరపత్రాలు పంచుతూ సీఎం ఆశీర్వాద సభకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మారపెల్లి సుశీల, కేసిరెడ్డి లావణ్య, బీఆర్‌ఎస్ నాయకురాళ్లు కోయ్యడ శ్రీదేవి, ప్రభావతిరెడ్డి, రేణుక, మహేశ్, తిరుపతి, వసంత, రాధిక, రాజేశ్వరి, సరోజ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.




హుజూరాబాద్‌టౌన్: 7వ వార్డులో కరపత్రాలు పంచుతూ ఓటు అభ్యర్థిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్

# మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరే

- ఆయనకే రాష్ట్రంలోని ముదిరాజ్‌ల దీవెనార్తి
- ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 15: తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఆయనకే రాష్ట్రంలోని ముదిరాజ్‌ల దీవెనార్తి ఉంటుందని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్ పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి ముదిరాజ్‌లు బ్రహ్మరథం పడుతుండడమే అందుకు నిదర్శనమని తెలిపారు. హుజూరాబాద్‌లోని బీఆర్‌ఎస్ ఆఫీస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాదాసీదాగా కోళ్ల ఫారాలు నడుపుకొనే ఈటల రాజేందర్‌కు కోళ్లయినా మనుషులైనా ఒకటేనని, గుడ్లు పెట్టడం మానేసిన కోళ్లను కసాయి కొట్లకు అమ్మినట్లు తన అవసరం తీరాక మనుషులను కూడా నిర్దాక్షిణ్యంగా ముంచుతాడని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కౌశిక్‌రెడ్డి బౌలింగ్‌కి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రణబ్ రనౌట్ అని, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ డకౌట్ అని సమ్మయ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ సింగిల్ విండో వైస్ చైర్మన్ ముద్రబోయిన శంకర్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు గంట మధూకర్‌ముదిరాజ్, భూమ్ రామకృష్ణముదిరాజ్, హుజూరాబాద్ సోషల్ మీడియా కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి, నాయకులు కోనేటి రమేశ్, పోచంపల్లి సదయ్య, రైతు బంధు సమితి సభ్యులు సుంకేనపల్లి శ్రీనివాస్, తునికి నరేశ్, సబ్బని రమేశ్, పెరుమల్ల సదానందం, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్

## ఎన్నికల బరిలో 22 మంది అభ్యర్థులు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్15: హుజూరాబాద్ శాసన సభ నియోజకవర్గంలో 22 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు తెలిపారు. ఉప సంహరణ చివరి రోజు బుధవారం ముగ్గురు అభ్యర్థులు పోటీ నుంచి ఉప సంహరించుకోగా, 22 మంది బరిలో నిలిచారని చెప్పారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు వెను వెంటనే గుర్తులు కేటాయించి, ఎన్నికల సంఘం సూచనలు వివరించినట్లు తెలిపారు.

## పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన సీపీ

హుజూరాబాద్‌టౌన్/ శంకరపట్నం, నవంబర్15: హుజూరాబాద్, కేశవపట్నం పోలీస్ స్టేషన్లను బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలోని పలు రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేరస్తులు, రౌడీ షీటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలోని అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలు నిర్వహించి ఓటర్లకు భద్రతా భావాన్ని కలిగించాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ ఎల్ జీవన్‌రెడ్డి, టౌన్ సీఐ బొల్లం రమేశ్, కేశవపట్నం ఎస్ఐ లక్ష్మారెడ్డి, ఏఎస్ఐలు వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.